సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 25 । నవంబర్ । 2024



అప్పన్నకు ఆర్జిత సేవలు 8లో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన, నిత్య కల్యాణం నిర్వహించారు.



పంచారామాలకు పయనం

8లో

విశాఖ: పంచారామాల దర్శనానికి ఆదివారం ద్వారకా బస్‌స్టేషన్ నుంచి 11 బస్సుల్లో భక్తులు బయలుదేరి వెళ్లారు.



సాగరతీరంలో సందడి

విశాఖ: నగరంలోని తీర ప్రాంతాలకు పర్యాటకులు పోటెత్తారు. చిన్నారులు కేరింతలు, ఆటపాటలతో సందడి చేశారు.





సాహసం చేద్దామా..

పర్యాటకులను ఆకట్టుకునేలా అరకు గిరిజన మ్యూజియాన్ని పాడేరు ఐటీడీఏ తీర్చిదిద్దుతోంది. వారి అభిరుచులకు అనుగుణంగా స్కై సైక్లింగ్, బోటింగ్, ఆర్చరీ, కమెండో నెట్ అందుబాటులోకి వచ్చింది. వీటికి సందర్శకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఆసక్తి గల వారు స్కై సైక్లింగ్‌కు రూ.200, ఆర్చరీ షూటింగ్‌కు (5 విల్లులకు) రూ. 75, పెడల్ బోటింగ్‌కు రూ. 75, కమెండో నెట్‌కు రూ. 30 చొప్పున చెల్లించాలి. – అరకులోయ టౌన్





న్యూస్‌రీల్

విజ్ఞానయాత్రకు కాఫీ రైతులు



విజ్ఞానయాత్రకు తరలివెళ్తున్న కాఫీ రైతులు, కేంద్ర కాఫీబోర్డు అధికారులు

సాక్షి,పాడేరు: విజ్ఞానయాత్రలో భాగంగా 12 మందితో కూడిన కాఫీ రైతుల బృందం ఆదివారం కర్నాటక బయలుదేరి వెళ్లింది. అక్కడ సాగవుతున్న కాఫీతోటల యాజమాన్యం, నాణ్యమైన కాఫీ ఉత్పత్తుల తయారీపై అక్కడి రైతుల అనుభవాలను తెలుసుకుంటారని కేంద్ర కాఫీబోర్డు ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ రమేష్ తెలిపారు. వారం రోజులపాటు క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందన్నారు. నాణ్యమైన పార్చ్‌మెంట్ తయారీపై అక్కడి రైతుల అనుభవాలను తెలుసుకుంటారని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనకు కేంద్ర కాఫీబోర్డు ఆధ్వర్యం వహించింది.

మోదమ్మకు నీరాజనం

- భారీగా తరలివచ్చిన భక్తజనం



మోదకొండమ్మతల్లిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: మోదకొండమ్మతల్లి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మైదాన ప్రాంతాలకు చెందిన భక్తులతో పర్యాటకులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, సభ్యులు లకే రత్నాబాయి, సల్లా రామకృష్ణ, కొణతాల సతీష్ తదితరులు భక్తుల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప, భవానీలు, భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఘాట్‌లోని మోదకొండమ్మతల్లి పాదాలు గుడికి భక్తులు భారీగా తరలివచ్చారు.

తెల్లదొరలను గడగడలాడించిన మన్యం వీరుల స్ఫూర్తిని భావి తరాలకు అందించేందుకు తాజంగిలో చేపట్టిన గిరిజన స్వాతంత్య్ర సమరయోధుల స్మారక మ్యూజియం పనులు ముందుకు సాగడం లేదు. మూడేళ్లలో పూర్తికావాల్సిన ఈ పనులు ఇప్పటివరకు 30శాతం మాత్రమే జరిగాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంచి ఆశయంతో చేపట్టినా అందుకు తగ్గట్టుగా పనులు మాత్రం జరగడం లేదు.



తాజంగిలో అసంపూర్తిగా ఉన్న స్వాతంత్య్ర సమరయోధుల స్మారక మ్యూజియం భవన నిర్మాణాలు

స్మారకం.. నిర్లిప్తం

నత్తనడకన స్వాతంత్య్ర సమరయోధుల మ్యూజియం పనులు

- మూడేళ్లలో జరిగింది 30 శాతం మాత్రమే
- పుష్కలంగా నిధులున్నా.. తాజంగిలో సాగని నిర్మాణాలు
- గత ప్రభుత్వ ఆశయానికి నిర్లక్ష్యం గండి



సాక్షి, పాడేరు: గిరిజన పోరాటయోధుల చరిత్రతో పాటు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేసి స్ఫూర్తి నింపేందుకు చేపట్టిన స్వాతంత్య్ర సమరయోధుల స్మారక మ్యూజియం పనులు నత్తనడకను తలపిస్తున్నాయి. 2017లో మంజూరైన ఈ మ్యూజియంపై ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. లంబసింగి–తాజంగి ప్రధాన రోడ్డును ఆనుకుని సుమారు 21.67 ఎకరాలు కేటాయించింది. 2021లో అక్టోబర్ పదిన అప్పటి డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పాముల పుష్పశ్రీవాణి శంకుస్థాపన చేశారు. ఆజాదీకి అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఏపీ గిరిజన సంక్షేమశాఖ సంయుక్తంగా రూ.35 కోట్లతో ఈ నిర్మాణ పనులు చేపట్టాయి. లంబసింగి–తాజంగి ప్రధాన రోడ్డును ఆనుకుని ప్రారంభించిన ఈ కట్టడం పనులు మూడేళ్లలో పూర్తి కావాలి. అయితే ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా పనులతీరు ఉంది. ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాలకు రూ.8 కోట్లు ఖర్చు చేసినట్టు సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. ఈ స్మారక మ్యూజియం నిర్మాణం పూర్తయితే లంబసింగి పర్యాటక ప్రాంతానికి జాతీయస్థాయి మంచి గుర్తింపు వస్తుందని స్థానికులు భావించారు. ఇప్పుడు ఈ నిర్మాణం తీరును చూసి నిరాశకు గురవుతున్నారు.

- నాటి గిరిజన స్వాతంత్య్ర సమరయోధుల చరిత్రను సందర్శకుల కళ్లకు కట్టినట్టు వివరించేందుకు 300 మంది కూర్చొని వీక్షించేలా డిజిటల్ థియేటర్ నిర్మించాల్సి ఉంది. ట్రైబల్ థీమ్ హట్‌తో కూడిన రెస్టారెంట్, ఓపెన్ థియేటర్, స్వాగత ప్లాజా పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మన్యం కేంద్రంగా సాగిన స్వాతంత్య్ర సమరానికి సంబంధించి ఆధారాలు, గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించి మూలాలను సేకరించేందుకు గత ప్రభుత్వంలో అధికార యంత్రాంగం సమాయత్తం చేసింది.

మ్యూజియంలో ప్రవేశ ప్లాజా, రెస్టారెంట్‌తో కూడిన గిరిజన హట్, యాంఫీ థియేటర్ నిర్మించాల్సి ఉంది. ఇవి పూర్తయితే కొండదొర, సారిక తదితర గిరిజనులు వినియోగించిన వస్తువులు, ఆయుధాలు, గొలుసులను అధికారులు ప్రదర్శిస్తారు.

- చింతపల్లి పరిసర ప్రాంతాలలోని కొండలు, లోయలు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నేతృత్వంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిగిన ముఖ్యమైన గిరిజన స్వాతంత్య్ర ఉద్యమాల్లో ఒకటైన చరిత్రాత్మకమైన రంప తిరుగుబాటును గుర్తు చేసేలా మ్యూజియంను తీర్చిదిద్దాల్సి ఉంది.
- అల్లూరి సీతారామరాజును పట్టుకునేందుకు 1924లో రూథర్‌ఫర్డ్ సందర్శించిన లంబసింగిలోని అతిథి గృహం శిథిలమైంది. దీని సమాచారం మ్యూజియంలో అందుబాటులో ఉంచాలని గత ప్రభుత్వం సంకల్పించింది.
- ప్రకృతి, ఆధ్యాత్మికత మరియు గిరిజన జీవన విధానానికి సంబంధించిన ఇతివృత్తాలను తెలియజేసేలా సవర చిత్రాలను మ్యూజియంలో ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేసింది.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం..

మ్యూజియం నిర్మాణ పనులకు నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే పనులు నత్తనడకన జరగడానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ఇవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ప్రస్తుతం జాతీయ రహదారి 516 రోడ్డు పనులు కూడా జరుగుతున్నాయి. దీనిని ఆనుకుని మ్యూజియం నిర్మాణం చేపట్టారు. తాజంగి ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు అసంపూర్తి భవనాలు దర్శనమిస్తున్నాయి.

పనులు వేగవంతం చేస్తాం



తాజంగిలోని స్వాతంత్య్ర సమరయోధుల మ్యూజియం నిర్మాణాలను త్వరితంగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నాం. ఈ మేరకు ఇటీవల గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్‌శాఖ అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చాం. పనుల్లో జాప్యం లేకుండా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని భవన నిర్మాణ పనులను ఇప్పటికే కాంట్రాక్టర్లు ప్రారంభించారు.

– వి.అభిషేక్, పీవో, పాడేరు ఐటీడీఏ

వణికిస్తున్న చలిగాలులు

- మినుములూరులో 12..
- అరకులోయలో 13.6..
- చింతపల్లిలో 14 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు
- చలి గుప్పిట్లో గిరిజన గ్రామాలు





లంబసింగిలో చలి మంటలుకాగుతున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు: కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతుండటంతో చలిగాలులు విజృంభిస్తున్నాయి. సాయంత్రం నుంచి వీటి ప్రభావం ఎక్కువగా ఉండటంతో చలిమంటలను ఆశ్రయిస్తున్నాయి. శనివారం పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 12 డిగ్రీలు,అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 13.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

దట్టంగా పొగమంచు..

చింతపల్లి: చలి తీవ్రత పెరిగింది. ఈ ప్రాంతంలో ఉదయం 9 గంటలు వరకు పొగ మంచు దట్టంగా కురుస్తోంది. ఆదివారం చింతపల్లిలో 14 డిగ్రీలు, జి.మాడుగులలో 10.5 డిగ్రీలు, హుకుంపేటలో 12.5 డిగ్రీలు, పెదబయలులో 13.1 డిగ్రీలు, అనంతగిరిలో 14.2 డిగ్రీలు, కొయ్యూరులో 17.8 డిగ్రీలు, ముంచంగిపుట్టులో 20.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్, వాతావరణ విభాగం నోడల్ అధికారి ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

ముంచంగిపుట్టు:రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. పొగ మంచు దట్టంగా కురుస్తుండడంతో రోజువారి పనులకు వెళ్లే కూలీలు, వ్యాపారులు వణుకుతున్నారు.

ఫీజులకోసం ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక

పాడేరు : ఫీజులు చెల్లించలేదని ప్రయివేటు విద్యా సంస్థలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజులను రియంబర్స్ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. త్వరలోనే ఫీజులు విడుదల అవుతాయన్నారు. ఫీజులు చెల్లించలేదన్న కారణంతో యాజమాన్యాలు విద్యార్థులను కళాశాలలకు అనుమతించకపోవడం, హాల్ టికెట్లు జారీ చేయకపోవడం, పరీక్షల రానీయకపోవడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి విద్యార్థి పరీక్ష రాసేలా విద్యాసంస్థలు అవకాశం కల్పించాలన్నారు. ఈ విషయాన్ని ప్రైవేట్, ఎయిడెడ్, కార్పొరేట్ యాజమాన్యాలు గమనించాలన్నారు.

పది కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్టు

హుకుంపేట: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు అప్రమత్తమయ్యారు. కొంతిలి గ్రామ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. పెదబయలు ప్రాంతం నుంచి గూడ గ్రామం మీదుగా హుకుంపేట వైపు వెళ్తున్న ఆటోను తనిఖీ చేశారు. పది కిలోల గంజాయితో తమిళనాడుకు చెందిన ఇద్దరు పట్టుబడ్డారన్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. గంజాయి, ఆటోను సీజ్ చేశామని ఆయన వివరించారు.



గంజాయి నిందితులతో హుకుంపేట పోలీసులు

పులకించిన పర్యాటకం

పాడేరు/చింతపల్లి/అరకులోయ టౌన్/డుంబ్రిగుడ/జి.మాడుగుల : వీకెండ్ కావడంతో జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు ఆదివారం కిటకిటలాడాయి. వంజంగి కొండ సందర్శకులతో కిటకిటలాడింది. లంబసింగికి భారీగా తరలివచ్చారు. చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద ప్రకృతిసోయగాలను తిలకించారు. తాజంగి జలాశయం వద్ద బోటు షికారు, జిప్ లైన్ ఎక్కి ఎంజాయ్ చేశారు. అరకులోయకు తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, బెంగళూరు ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. మాడగుడ సన్‌రైజ్ వ్యూయింట్ సందడిగా మారింది. గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్‌ను సందర్శించారు. వలిసె, పొద్దుతిరుగుడు తోటల్లో ఫొటోలు దిగారు. కొత్తపల్లి జలపాతానికి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. అరకుసంత, జైపూర్ జంక్షన్, రైల్వే గేటు, కురిడి, పంతలచింత, అంత్రిగుడ ప్రదేశాలకు పర్యాటకుల తాకిడి నెలకొంది. అంజోడాలోని అరకు పైనరీకి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు.



వంజంగిలో ప్రకృతి అందాలను తిలకిస్తున్న పర్యాటకులు



డప్పు వాయిద్యాలతో కళాకారుల సందడి



మాడగడ వ్యూ పాయింట్ వద్ద థింసా నృత్యం చేస్తున్న గిరి మహిళలు



అరకు పైనరీకి తరలివచ్చిన పర్యాటకులు



మాడగడ వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన టిఫిన్ దుకాణం వద్ద పర్యాటకులు



పర్యాటకులతో కిటకిటలాడుతున్న మాడగుడ వ్యూ పాయింట్



చాపరాయి జలపాతం వద్ద పర్యాటకుల సందడి



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకులు



పర్యాటకులతో కిక్కిరిసిన చాపరాయి జలపాతం ముఖద్వారం



నరింజవలస సమీపంలో ప్రొద్దుతిరుగుడు తోటలో ఫొటోలు తీసుకుంటున్న పర్యాటకులు



డుంబ్రిగుడ ప్రాంతంలో వనభోజనానికి వంటావార్పులో నిమగ్నమైన ఓ కుటుంబం



అరకు పైనరీలో కుటుంబ సభ్యులతో తరలివచ్చిన పర్యాటకులు

క్లుప్తంగా

పంచారామాలకు పయనం

డాబాగార్డెన్స్: మార్గశిరమాసంలో భక్తుల సౌకర్యార్థం పంచ వైష్ణవ క్షేత్ర దర్శినికి ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. మార్గశిర మాసంలో వచ్చే 7, 14, 21, 18 తేదీల్లో రాత్రి 9 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. ద్వారకాతిరుమల(శ్రీ వేంకటేశ్వర స్వామి), అంతర్వేది(శ్రీలక్ష్మీ నరసింహస్వామి), అప్పన్నపల్లి(శ్రీ బాల బాలాజీ), గొల్లల మామిడాడ(కోదండ రామాలయం), అన్నవరం(శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి) పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరిగి విశాఖ రావడంతో ఈ యాత్ర ముగుస్తుంది. ప్రయాణ చార్జీ(సూపర్ లగ్జరీ) ఒక్కొక్కరికీ రూ.1,800గా నిర్ణయించారు. https://www.apsrtconline.in లో పంచ వైష్ణవ క్షేత్ర దర్శిని రూట్ సెలెక్ట్ చేసి సీట్లు రిజర్వ్ చేసుకోవచ్చు. అలాగే ద్వారకా బస్‌స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్లు అందుబాటులో ఉంటాయని అప్పలనాయుడు తెలిపారు. మరిన్ని వివరాలకు 99592 25602, 90522 27083, 99592 25594, 91001 09731లో సంప్రదించవచ్చు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గిరిజనుడి మృతి



సంఘటన స్థలంలో గురు మృతదేహం

అరకులోయ టౌన్: విశాఖ–అరకు ప్రధాన రహదారిలో కాలినడకన వెళ్తున్న గిరిజనుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. ఆదివారం మండలంలోని బోసుబెడ గ్రామ సమీపంలోని సీబీఎం హోం ఎదురుగా రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మాడగడ పంచాయతీ మంజగుడ గ్రామానికి చెందిన సమర్ది గురు (25) బోసుబెడ నుంచి అరకులోయ వైపు కాలినడకన వెళ్తుండగా విశాఖ వైపు నుంచి అరకులోయ వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. సింహగిరీశునికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రైల్వే జోన్‌పై తొండాట



టెండర్లకు సై.. శంకుస్థాపనకు నై!

- జోన్ కార్యాలయ నిర్మాణానికి టెండర్లు పిలిచిన రైల్వే బోర్డు
- ప్రధాని పర్యటనలో శంకుస్థాపన వద్దంటూ తొలగించేసిన కూటమి నేతలు
- వాల్తేరు డివిజన్ పరిధిలో రూ.450 కోట్లతో మూడు ప్రాజెక్టుల శంకుస్థాపనకు ఏర్పాట్లు

సాక్షి, విశాఖపట్నం : దశాబ్దాల కలగా మిగిలిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై కూటమి ప్రభుత్వం తొండాట ఆడుతోంది. జోన్ ప్రధాన కార్యాలయానికి సంబంధించిన టెండర్లను రైల్వే బోర్డు ఆహ్వానించినా.. ప్రధాని మోదీ పర్యటనలో శంకుస్థాపనకు మాత్రం కూటమి సర్కారు మోకాలడ్డింది. ఈనెల 29న జరగాల్సిన జోన్ ఫౌండేషన్ స్టోన్ పనులను వాయిదా వేయాలంటూ అధికార పార్టీకి చెందిన నేతలు పట్టుబట్టడంతో మరోసారి 'జోన్'కు గ్రహణం పట్టింది. అయితే మొత్తం రూ.450 కోట్ల విలువైన రైల్వే పనులకు మాత్రం ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు.

నాడు శిలాఫలకం దాచేసి.. భూమి పేరుతో డ్రామాలు చేసి..

విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు 2019లో కేంద్రం పచ్చజెండా ఊపింది. జోన్‌కు సంబంధించిన డీపీఆర్‌ని అదే ఏడాది చివర్లో ఇచ్చేశారు. కానీ ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు. కేవలం రాజకీయ కక్షతోనే జోన్‌ని ఆపేశారు. ముందుగా 2022లో జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి డీఆర్‌ఎం కార్యాలయం ఎదురుగా ఉన్న వైర్‌లెస్ కాలనీని ఎంపిక చేశారు. వైర్‌లెస్ కాలనీలో ఉన్న 13 ఎకరాల్లో 8 ఎకరాల విస్తీర్ణంలో హెడ్‌క్వార్టర్స్‌కు సంబంధించి డిజైన్లకు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆమోదముద్ర వేశారు. కాలనీని సైతం పరిశీలించారు. రూ.106 కోట్ల వ్యయంతో జోన్ ప్రధాన కార్యాలయానికి టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమయ్యారు. టెండర్లు ఖరారు చేసిన తర్వాత అగ్రిమెంట్ జరిపి.. 36 నెలల్లో భవనాన్ని పూర్తి చేయాలని రైల్వే అధికారులు భావించారు. 2022 నవంబర్ 12న ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారనీ.. శిలాఫలకం కూడా సిద్ధం చేశారు. కానీ 11వ తేదీ అర్ధ రాత్రి 12 గంటల తర్వాత.. హఠాత్తుగా జోన్ శంకుస్థాపన కార్యక్రమాన్ని వాయిదా వేసేశారు. సిద్ధం చేసిన శిలాఫలకాన్ని దాచేశారు. అప్పుడు శంకుస్థాపన చేస్తే.. క్రెడిట్ అంతా అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందనే రాజకీయ కుట్రతో ఉత్తరాంధ్ర వాసుల కలలను కల్లలు చేసేశారు. తర్వాత ముంపు భూమి పేరుతో రాజకీయాలు చేసి ప్రజలను మోసం చేశారు.

మరోసారి వాయిదా

ఇప్పుడు మరోసారి అదే మోసం చేసేందుకు కూటమి నేతలు సిద్ధమవుతున్నారు. ఈసారి రాజకీయ కక్షతో కాకుండా ఎన్నికల స్టంట్ కోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 29న ప్రధాని మోదీ విశాఖలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ప్రధాని చేతుల మీదుగా జరగనున్నాయి. దీనికి సంబంధించి వివిధ శాఖల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. రైల్వే నుంచి కూడా నాలుగు ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించగా.. పీఎంవో వాటన్నింటినీ ఆమోదించింది. ఇందులో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ శంకుస్థాపన కార్యక్రమం కూడా ఉంది. ఈ విషయం తెలుసుకున్న కూటమి నేతలు.. జోన్ శంకుస్థాపనని వాయిదా వేయాలని పట్టుబట్టారు. జమిలి ఎన్నికల ముందు చేస్తే.. ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలమని పీఎంవో ముందు ఏకరువు పెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పుడు శంకుస్థాపన చేస్తే ప్రజలు మర్చిపోతారంటూ చెప్పినట్లు సమాచారం. రాష్ట్ర కూటమి నేతల ఒత్తిళ్ల నేపథ్యంలో జోన్ శంకుస్థాపన కార్యక్రమాన్ని తొలగించాలంటూ 23వ తేదీ అర్ధరాత్రి వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులకు పీఎంవో నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో మిగిలిన మూడు ప్రాజెక్టులను మాత్రమే ప్రధాని కార్యక్రమంలో పొందుపరిచారు. రైల్వే జోన్‌ను ఉత్తరాంధ్ర ప్రజల కలల ప్రాజెక్టుగా చూడకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం కూటమి నేతలకే చెల్లింది. మొత్తంగా ప్రధాని పర్యటనలో వాల్తేరు డివిజన్‌కు సంబంధించి సుమారు రూ.450 కోట్ల అంచనా వ్యయంతో 3 ప్రాజెక్టులకు శంకుస్థాపన జరగనుంది. ఇందులో దువ్వాడ–ఉత్తర సింహాచలం స్టేషన్ల మధ్య 3, 4 లైన్ల నిర్మాణం, సర్ఫేస్ లెవల్ క్రాసింగ్ ఇబ్బందులు తొలగించేలా.. పెందుర్తి నుంచి ఉత్తర సింహాచలం మధ్య ఫ్లైఓవర్ నిర్మాణం, విజయనగరం–కొత్తవలస మధ్య 4వ రైల్వే లైన్ నిర్మాణ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారని రైల్వే వర్గాలు వెల్లడించాయి.

ప్రధాని శంకుస్థాపన చేయనున్న ప్రాజెక్టులు

- దువ్వాడ–ఉత్తర సింహాచలం స్టేషన్ల మధ్య 3, 4 లైన్ల నిర్మాణం.
- పెందుర్తి నుంచి ఉత్తర సింహాచలం మధ్య ఫ్లైఓవర్ నిర్మాణం
- విజయనగరం–కొత్తవలస మధ్య 4వ రైల్వే లైన్ నిర్మాణం

2 నుంచి మార్గశిర మాసోత్సవాలు



డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో డిసెంబర్ 2 నుంచి 30వ తేదీ వరకు మార్గశిర మాసోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు తెలిపారు. ప్రత్యేక పూజల వివరాలను తెలియజేశారు. మార్గశిరమాసంలో ప్రతీ గురువారం పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామని, ఇందులో పాల్గొనాలనుకునే భక్తులు రూ.7,500 చెల్లించాలని తెలిపారు. గురువారం మినహా మిగిలిన రోజుల్లో పంచామృతాభిషేకంలో పాల్గొనదలిచే భక్తులు రూ.2,500 పూజా రుసుం చెల్లించాలన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేకానికి రూ.1,116 చెల్లించాలని, ఆయా పూజల్లో పాల్గొనదలచే భక్తులు పూజా రుసుమును ముందుగా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఆన్‌లైన్ ద్వారా www.aptemples.ap.gov.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. లేదా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, విశాఖపట్నం అకౌంట్ నెంబరు 0608 1001 1006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806 08లో పూజా రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వారు ఆ లావాదేవీ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్ర నామాలు, పూర్తి చిరునామాను endow&eokanaka@gov.in ద్వారా పంపవచ్చని వివరించారు. నేరుగా టికెట్లు తీసుకునేవారి కోసం దేవాలయ కౌంటర్లలోనూ టికెట్లు అందుబాటులో ఉంచామన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు టికెట్లు పొందవచ్చని తెలియజేశారు.

ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- 29న ఏయూ మైదానంలో బహిరంగ సభ, రోడ్‌షో
- వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్న ప్రధాని



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, చిత్రంలో సీపీ బాగ్చి, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు

మహారాణిపేట: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 29వ తేదీన విశాఖ పర్యటన నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన కలెక్టరేట్‌లో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ, రోడ్ షో గురించి ఎంపీ ఎం.శ్రీభరత్, ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, అధికారులతో చర్చించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వీవీఐపీల రాక, ప్రధాన మంత్రికి స్వాగతం ఏర్పాట్లు, ప్రజలకు తాగునీరు, ఆహారం, ఇతర వసతుల కల్పన తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాధుర్, డీసీపీలు, ఇతర రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఇలా..

ప్రధాని మోదీ ఈ నెల 29వ తేదీ సాయంత్రం 3.40 గంటలకు ప్రత్యేక విమానంలో తూర్పు నౌకాదళానికి చెందిన ఎయిర్‌బేస్ ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో కాన్వెంట్ జంక్షన్, రైల్వే స్టేషన్, సంపత్ వినాయక్ టెంపుల్, టైకూన్, సిరిపురం జంక్షన్ మీదుగా ఎస్పీ బంగ్లా రోడ్డు నుంచి వేదిక వద్దకు 4.40 గంటలకు వస్తారు. ఈ క్రమంలో టైకూన్ జంక్షన్ నుంచి ఎస్పీ బంగ్లా వరకు రోడ్‌షోలో పాల్గొంటారు. ప్రజలకు అభివాదం చేసుకుంటూ ఏయూ మైదానంలో బహిరంగ సభకు చేరుకుంటారు. బహిరంగ సభలో రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులతో కలిసి పాల్గొంటారు. ఈ సందర్భంగా ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుతో పాటు, రైల్వే లైన్లు, మొదలైన వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్ని ప్రధాని చేయనున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ప్రసంగాల అనంతరం సాయంత్రం 5.25 నుంచి 5.43 గంటల వరకు ప్రజలనుద్దేశించి ప్రధాని ప్రసంగించనున్నారు. సాయంత్రం 5.45 గంటలకు సభా వేదిక నుంచి ఎయిర్ పోర్టుకు తిరుగుపయనమవుతారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి చేరుకోనున్నారు.

ప్రణాళికాపరంగా ఇంటిగ్రేటెడ్ సివిల్స్ కోచింగ్

21వ సెంచరీ ఐఏఎస్ అకాడమి కరస్పాండెంట్, సెక్రటరీ ధరణి



పాడేరు : సివిల్స్ పోటీ పరీక్షల్లో ఔత్సాహికవంతులైన అభ్యర్థులకు ప్రణాళికబద్ధంగా ఇంటిగ్రేటెడ్ సివిల్స్ కోచింగ్ అందిస్తున్నామని 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమి కరస్పాండెంట్, సెక్రటరీ ధరణి తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. సివిల్స్ కోచింగ్ కోసం వచ్చే ఏడాది జనవరిలో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్షల్లో ఫస్ట్ ర్యాంకు సాధించిన గిరిజన అభ్యర్థికి 40 శాతం, సెకెండ్ ర్యాంకు సాధించిన గిరిజన అభ్యర్థికి 30 శాతం, మూడో ర్యాంకు సాధించిన గిరిజన అభ్యర్థికి 20 శాతం ఫీజులో రాయితీ ఇస్తామన్నారు. ఇంటర్ సెకెండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయాలన్నారు. టెస్ట్, కరెంట్ అఫైర్స్‌పై సిలబస్ ఉంటుందన్నారు. ఆసక్తి గల జర్నలిస్టుల పిల్లలకు కూడా 40 శాతం ఫీజు రాయితీ కల్పిస్తామని చెప్పారు. పేద గిరిజన విద్యార్థులకు రాయితీపై సివిల్స్ శిక్షణ అందజేస్తామన్నారు. తమ సంస్థ నుంచి ఇప్పటి వరకు సుమారు 1900 మంది అభ్యర్థులు సివిల్స్, గ్రూప్–1, గ్రూప్–2, ఎస్ఐ, ఎస్ఎస్సీలో ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. 2011 నుంచి తమ సంస్థలో శిక్షణ పొందిన వారు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. తమ సంస్థ ద్వారా గతంలో గ్రూప్–1కు ఇద్దరు గిరిజన విద్యార్థులు, 24 మంది గిరిజన విద్యార్థులు ఎస్ఐ ఉద్యోగాలకు, ఇద్దరు గిరిజన విద్యార్థులు డిప్యూటీ డీఈవో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తివివరాలకు 9030692229ను సంప్రదించాలని ఆమె కోరారు.

భజన పోటీల విజేత ఎం.మాకవరం



గెలుపొందిన భజన బృందాలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

చింతపల్లి: మండలంలోని చౌడుపల్లి మార్కెట్‌యార్డులో జిల్లా స్థాయి భజన పోటీలు ఆదివారం రసవత్తరంగా జరిగాయి. .దాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చౌడుపల్లి, రత్నగిరి గ్రామాల భజన బృందాల సహకారంతో ఈ పోటీలను నిర్వహించారు. జిల్లాలోని 12 మండలాల నుంచి 39 భజన బృందాలు పాల్గొన్నాయి. మార్కెట్‌యార్డు ప్రాంతమంతా భక్తి సంకీర్తనలతో మారుమోగిపోయింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరిగాయి. ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన ఎం.మాకవరం, రామన్నపాలెం భజన బృందాలకు రూ.15వేలు, రూ.10 వేలు నగదు బహుమతులు, జ్ఞాపిక అందజేశారు. తృతీయ స్థానంలో తాజంగి, సొలభం బృందాలు నిలవడంతో ఒక్కొక్కదానికి రూ.5 వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు. అన్ని బృందాలను సత్కరించారు. నిర్వాహకులు ఉగ్రంగి వెంకటరమణ (స్టీల్‌ప్లాంట్), సరమండ కొండబాబు, గంపరాయి విజయకుమార్, కాగి అశోక్, దేపూరి వెంగళయ్య, రీమల చందు, కోరాబు శాంతి ప్రసాద్ పాల్గొన్నారు.

ఏయూ.. అస్తవ్యస్తం



కూటమి పాపం...వర్సిటీకి శాపం

- వైస్ చాన్సలర్ నియామకంపై తేలని పంచాయితీ
- ఇన్‌చార్జిల పాలనలో అంతా స్తబ్దత
- కీలక నిర్ణయాలపై అధికారులు వెనకడుగు
- వర్సిటీ శతాబ్ది ఉత్సవాల ఊసే లేదు
- ఆంధ్రా విశ్వ విద్యాలయంలో నెలకొన్న అనిశ్చితి

విశాఖ విద్య: శతాబ్ది ఉత్సవాలకు సిద్ధమవుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆంధ్రా యూనివర్సిటీకి శాపంగా పరిణమిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డిపై తీవ్రమైన ఒత్తిడి తీసుకొచ్చి రాజీనామా చేయించిన పాలకులు.. ఆ స్థానంలో రెగ్యులర్ అధికారిని నియమించలేదు. దీంతో వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ గొట్టాపు శశిభూషణరావు ఇన్‌చార్జి వీసీగా వ్యవహరిస్తున్నారు. రిజిస్ట్రార్‌తో పాటు వర్సిటీలోని దాదాపు అన్ని విభాగాల అధిపతులను కూడా ఉన్నపాటున మార్చేశారు. ఇదే క్రమంలో రెగ్యులర్ వీసీ నియామక ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం తెరలేపడంతో పాలనాధికారుల్లో స్తబ్దత నెలకొంది. హెచ్‌వోడీలుగా సీట్లలో కూర్చొన్నా.. కొత్త వీసీ వస్తే మళ్లీ మార్పులు చేర్పులు ఉంటాయనే ప్రచారంతో కీలక నిర్ణయాలు తీసుకునేందుకు అంతా వెనుకంజ వేస్తున్నారు. ఈ మొత్తం పరిణామాల ప్రభావం విద్యార్థుల చదువులపై పడుతోంది.

వందేళ్ల ఉత్సవాల ప్రణాళిక ఏదీ?

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. 2025 ఏప్రిల్ నాటికి వర్సిటీ వందో ఏట అడుగుపెట్టనుంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఉస్మానియా తర్వాత శతాబ్ది ఉత్సవాలు చేసుకునేది ఆంధ్ర యూనివర్సిటీనే కావడం గమనార్హం. ఇతర దేశాలకు చెందిన విద్యార్థులు కూడా చదువులు సాగిస్తున్న నేపథ్యంలో వర్సిటీ చరిత్ర ప్రపంచానికి చాటేలా శతాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని ప్రసాదరెడ్డి వీసీగా ఉన్న సమయంలో ఆలోచన చేశారు. ప్రారంభ వేడుకలకు దేశ ప్రధాని, గవర్నర్, ముగింపు రోజున రాష్ట్రపతిని ఆహ్వానించేలా ముందస్తు కార్యాచరణకు సిద్ధమయ్యారు. కానీ ప్రస్తుతం రెగ్యులర్ వీసీ లేకపోవడంతో శతాబ్ది ఉత్సవాల ఊసే లేకుండా పోయింది.

వీసీ నియామకం ఇప్పట్లో తేలేనా?

వర్సిటీకి పూర్తి స్థాయి వీసీ నియామకం ఇప్పట్లో తేలేలా కనిపించడం లేదు. వీసీ పోస్టు కోసం రాష్ట్ర వ్యాప్తంగా వంద మందికి పైగానే ఆశావాహులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఏయూలో పనిచేస్తున్న అధ్యాపకులు కూడా ఉన్నారు. వీరిలో ఆ ఒక్కరు ఎవరనేది సెర్చ్ కమిటీ తేల్చాల్సి ఉంది. వర్సిటీ తరపున ఒకరు, యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) నుంచి ఒకరు, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒకరు.. ఇలా ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ వీసీ పోస్టుకు అన్ని అర్హతలు కలిగిన ముగ్గురు పేర్లను సిఫారసు చేయాలి. వీరిలో ఒకరిని వైస్ చాన్సలర్‌గా రాష్ట్ర ప్రభుత్వ సిఫారసు మేరకు గవర్నర్ నియమిస్తారు. కానీ సెర్చ్ కమిటీ కూర్పు ఇంకా జరగలేదు. మరో పక్క రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 16 యూనివర్సిటీలకు ఒకేసారి వీసీలను నియమించేలా కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. శతాబ్ది ఉత్సవాలు ముంచుకొస్తున్న వేళ ఆంధ్రా యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీ నియామకం జరిగే పరిస్థితులు కనిపించడం లేదని వర్సిటీ అధ్యాపకులు సైతం అంటున్నారు.

బయట వ్యక్తుల పెత్తనం

చదువుల కోవెలగా విరాజిల్లుతున్న విశ్వ విద్యాలయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చోటుచేసుకుంటున్న పరిణామాలపై విద్యావేత్తలతో పాటు, వర్సిటీ అధ్యాపకులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రసాదరెడ్డి వీసీగా ఉన్న సమయంలో పాలనా వ్యవహారాలతో పాటు, క్యాంపస్ చదువులపై కూడా పూర్తి స్థాయిలో పర్యవేక్షణ ఉండేది. ప్రస్తుతం ఇన్‌చార్జిలతో వర్సిటీ పాలన ఒకడుగు ముందుకు పదడుగులు వెనక్కి అన్నట్లుగా ఉంది. ఎయిడెడ్ కాలేజీల నుంచి వచ్చిన అధ్యాపకులను వారి మాతృస్థానాలకు పంపించడం అనేది రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో జరగాల్సిన నిర్ణయం. ఇలాంటి పాలనా వ్యవహారాల్లో కొంతమంది జోక్యం చేసుకుంటూ వైషమ్యాలు సృష్టిస్తున్నారు. కొన్ని విద్యార్థి సంఘాలు సైతం పాలనలో జోక్యం చేసుకుంటూ ధర్నాలు చేస్తుండటం వెనుక బయట వ్యక్తుల ప్రోద్బలం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ మొత్తం పరిణామాలతో విశ్వవిద్యాలయం ప్రతిష్ఠతోపాటు, చదువులు కూడా మసకబారే ప్రమాదం ఉందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంధ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం



నూతన కార్యవర్గంలో రాష్ట్ర నాయకులు

అనకాపల్లి: అంధ ఉద్యోగుల అసోసియేషన్ అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల సంయుక్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కోడిగంటి గోవిందరావు భవనంలో ఆదివారం ఈ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షునిగా కొరుప్రోలు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పల్లా పోతురాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గొల్లవిల్లి సురేష్ కుమార్, మహిళా కార్యదర్శిగా గరికపాటి గౌతమి, కోశాధికారిగా కాత్రపల్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా పరిశెట్టి అప్పారావు, ఎస్.నాగమణి, సహాయ కార్యదర్శులుగా ఎం.అనురాధ, శివశంకర్, అనకాపల్లి, అల్లూరి జిల్లా అసోసైట్‌అధ్యక్షుడిగా కోన బాబూరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా వెంకటేశ్వరరావు, బమ్మిడి రమణ, ఆలీలు వ్యవహరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంధ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రబాబు, రాష్ట్ర నాయకులు దాసరి సింహాచలం, కిమిడి కాసులమ్మ, ఎల్.బుజ్జి, వి.అప్పారావు, గోకాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనోత్సవం



స్టాల్‌లో వస్తువులు కొనుగోలు చేస్తున్న మహిళలు



అలరించిన గిరిజన సంప్రదాయ నృత్యాలు

ఏయూక్యాంపస్: బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం గిరిజన స్వాభిమాన ఉత్సవాలు ఘనంగా కొనసాగాయి. బీచ్ రోడ్డు వేదికగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో గిరిజన సంస్కృతులు, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నిర్వహిస్తున్న సాంస్కృతిక మేళా అందరినీ ఆకట్టుకుంటోంది. విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద ప్రత్యేక వేదికపై గిరిజన కళాకారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ఆదివాసీ సంస్కృతిని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించిన ఈ నృత్యాలు నగరవాసులను, పర్యాటకులను కట్టిపడేశాయి.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

కొమ్మాది(విశాఖ): బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని జన జాతీయ గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు రెండోరోజు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. రుషికొండ గాయత్రి పీజీ, డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పోటీలను ఎస్టీకమిషన్ చైర్మన్ డా.వి.జి.శంకర్రావు ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ మిషన్(టీసీఆర్‌టీఎం) భవన్ ప్రాంగణంలోని గిరిజన ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన 24 స్టాళ్లను పరిశీలించారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, టీసీఆర్‌టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాణి మందా పాల్గొన్నారు.